నమస్తే తెలంగాణ

# హైదరాబాద్

హైదరాబాద్- మేడ్చల్

I | హైదరాబాద్, బుధవారం 8 మే 2024 | HYDERABAD




| ప్రాంతం | వర్షపాతం(మి.మీ) |
|---|---|
| సికింద్రాబాద్ | 84.5 |
| కూకట్‌పల్లి | 70.8 |
| కుత్బుల్లాపూర్ | 40.5 |
| ఖైరతాబాద్ | 39.5 |
| కూకట్‌పల్లి | 39.5 |
| బాలానగర్ | 39 |
| శేరిలింగంపల్లి | 37.5 |

## కూలిన చెట్లు.. విద్యుత్ స్తంభాలు

నగరంలో కురిసిన భారీ వర్షానికి విద్యుత్ సరఫరాలో అంతరాయం కలిగింది. ఈదురు గాలులతో ప్రారంభమైన వర్షానికి పలు చోట్ల విద్యుత్ స్తంభాలు దెబ్బతిన్నాయి. తారానగర్ సెక్షన్ పాపిరెడ్డి కాలనీలో విద్యుత్ స్తంభం కూలిపోయింది. దీంతో ఆ ప్రాంతంలో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. వ్యాపార ప్రకటనల కోసం ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలు ఈదురు గాలులకు చెల్లాచెదురై గాలిలో ఎగురుతూ విద్యుత్ తీగలపై పడ్డాయి. ఇలాంటి ఘటనలు నగరంలోని కూకట్‌పల్లి, కుత్బుల్లాపూర్, మియాపూర్, చందానగర్, మూసాపేట ప్రాంతాల్లో జరిగాయని విద్యుత్ శాఖ అధికారులు తెలిపారు. ఫ్లెక్సీలు విద్యుత్ తీగలపై పడటంతో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది.గన్‌రాక్ ఎయిర్‌పోర్టు ఫీడర్ పరిధిలో విద్యుత్ సమస్యలు తలెత్తాయి.




అమీర్‌పేటలో రోడ్డుపై పారుతున్న వరద నీరు

# నగరం.. నరకం

### సాయంత్రం దంచికొట్టిన వాన.. రహదారులన్నీ జలమయం..

### గంటల కొద్దీ నిలిచిపోయిన ట్రాఫిక్.. చెట్లు తెగిపడినా.. ఇళ్లలోకి నీళ్లు చేరినా

### సహాయ చర్యల వైపు కన్నెత్తి చూడని జీహెచ్ఎంసీ.. ట్రాఫిక్ రద్దీని పట్టించుకోని పోలీసులు


ముషీరాబాద్‌లోని రాంనగర్‌లో ఓ ఇంట్లోకి చేరిన వరదనీరు

సిటీబ్యూరో, మే 7 (నమస్తే తెలంగాణ): వేసవి తాపంతో విలవిలలాడిపోతున్న నగరవాసులపై వరుణుడు ఒక్కసారిగా కుంభవృష్టి కురిపించాడు. ఎండల ధాటి నుంచి ఉపశమనం కలిగినా వాన ఒక్కసారిగా దంచికొట్టడంతో నగర రోడ్లన్నీ జలమయమయ్యాయి. ప్రధాన రహదారులపై గంటల కొద్దీ ట్రాఫిక్ జాం ఏర్పడింది. అనేక చోట్ల విద్యుత్ తీగలు తెగిపడి వందల కొద్దీ కాలనీలు అంధకారంలో మునిగిపోయాయి. వాతావరణ శాఖ ఒక రోజు ముందే నగరానికి భారీ వర్ష సూచన చేసినా జీహెచ్ఎంసీ అధికారులు, విద్యుత్ అధికారులు, ట్రాఫిక్ పోలీసులు అప్రమత్తం కాని ఫలితం నగర వీధుల్లో స్పష్టంగా కనిపించింది. నిమిషాల్లో పరిస్థితిని చక్కదిద్దాల్సిన ఆయా విభాగపు అధికారులు.. కుండపోత వర్షం పడుతున్నా ఎవ్వరూ సహాయక చర్యల్లో పాల్గొనలేదు. దీంతో నగరవాసులకు రోడ్లపై నరకమే కనిపించింది. సహాయక చర్యలపై బీఆర్ఎస్ ప్రభుత్వం అనుసరించిన సన్నద్ధత, ప్రస్తుత ప్రభుత్వం కనబరచకపోవడంపై నగరవాసులు బాహాటంగానే విమర్శలు కురిపించారు.

**అర్ధరాత్రి దాటినా రాని కరెంట్**

ముఖ్యంగా సికింద్రాబాద్, చిలకలగూడ, ఓయూ, మారేడుపల్లి, అల్వాల్, ప్యారడైజ్, ఎల్బీనగర్, కాప్రా, సుచిత్ర, జీడిమెట్ల, దిల్‌సుఖ్‌నగర్, కూకట్‌పల్లి, కుత్బుల్లాపూర్, బంజారాహిల్స్ తదితర ప్రాంతాల్లో భారీ వర్షం కురిసింది. మియాపూర్, గచ్చిబౌలి, కొండాపూర్ ప్రాంతాల్లో రోడ్లపై భారీగా వర్షపునీరు చేరడంతో కిలోమీటర్ల మేర ట్రాఫిక్ నిలిచిపోయింది. రాయదుర్గం బయోడైవర్సిటీ నుంచి ఐకియా వరకు, ఖాజాగూడ చౌరస్తా నుంచి డీపీఎస్ వరకు వాహనాల రాకపోకలు స్తంభించాయి. ఐటీ కారిడార్‌లో వాహనదారులు ట్రాఫిక్ సమస్యతో ముందుకు వెళ్లలేక రోడ్లపై తడుస్తూనే ఉండిపోవాల్సిన దుస్థితి వచ్చింది. ఈదురుగాలులతో పలు చోట్ల చెట్లు విరిగిపడటంతో జనం ఇబ్బందులు ఎదుర్కొన్నారు. కాగా, సికింద్రాబాద్‌లో అత్యధికంగా 84.5 మిల్లి మీటర్ల వర్షపాతం నమోదైంది. కూకట్‌పల్లిలో 70.8మి.మీటర్ల వర్షపాతం నమోదైందని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు.



# కుర్ కురే బీజేపీ.. కిరికిరి కాంగ్రెస్

## రెండు పార్టీలతో తెలంగాణకు ఒరిగేదేమీ లేదు

**తెలంగాణను కాపాడాల్సింది కేసీఆరే..**

**రేవంత్ రెడ్డి ప్రసంగాలను ఫ్యామిలీతో కలిసి చూడలేం..**

**బీజేపోళ్లే 'కిషన్ రెడ్డి హఠావో.. సికింద్రాబాద్ బచావో' అంటున్నరు**

**ఐదేండ్లు కేంద్రమంత్రిగా ఉండి 5 రూపాయల పని చేసిండా..?**


**అంబర్‌పేట తిలక్‌నగర్ రోడ్ షోలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్**

సిటీబ్యూరో, మే 7 (నమస్తే తెలంగాణ): హైదరాబాద్‌ను కేంద్ర పాలిత ప్రాంతం (యుటీ) చేసి నగరాన్ని లూటీ చేయాలని బీజేపీ కుట్రలు చేస్తున్నదని, దీన్ని అడ్డుకోవాలంటే పార్లమెంట్‌లో బీఆర్ఎస్ ఉండాలని బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు అన్నారు. పదేళ్లుగా ప్రధానిగా పనిచేసిన మోదీ తెలంగాణకు, హైదరాబాద్‌కు ఏం అభివృద్ధి చేశావో చెప్పి ఓట్లు అడగాలని ప్రశ్నించారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా మంగళవారం రాత్రి అంబర్‌పేట నియోజకవర్గ పరిధిలోని తిలక్‌నగర్ రోడ్డు షోలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పాల్గొన్నారు. సికింద్రాబాద్ పార్లమెంటు అభ్యర్థి టి.పద్మారావు గౌడ్‌ను గెలిపించాలని ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. '' అంబర్‌పేటలో వర్షం పడుతున్నా ఓపిగ్గా ఉన్నారంటే మీరు గొప్పవారు. ఎందుకంటే మంచి ఎమ్మెల్యేను కాలేరును 2 సార్లు గెలిపించినందుకు మీకు ధన్యవాదాలు. కాంగ్రెస్ పార్టీ అరచేతిలో వైకుంఠం చూపిస్తోంది. కాంగ్రెస్ పార్టీ కిరి కిరి పార్టీ అయితే... బీజేపీ కుర్ కురే పార్టీగా మారింది. ఈ రెండు పార్టీలతో తెలంగాణ అభివృద్ధి జరగదు.'' ఈ ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు 10 నుంచి 12 సీట్లు ఇస్తే ఏడాదిలోగా మళ్లీ కేసీఆర్ రాష్ట్ర రాజకీయాలను శాసించే పరిస్థితి వస్తదని కేటీఆర్ అన్నారు. బీజేపి వాళ్లు గుడికట్టినం ఓటు వేయాలంటున్నారని.. మరి ఎంతో అద్భుతంగా కేసీఆర్ యాదాద్రి కట్టారని, కాళేశ్వరం లాంటి ప్రాజెక్టులు నిర్మించారని చెప్పారు. కేసీఆర్ ఉన్నప్పుడే బాగుండే అనుకునే వాళ్లంతా ఈ నెల 13న ఓటేసి బీఆర్ఎస్ అభ్యర్థులను గెలిపించుకోవాలని కేటీఆర్ పిలుపునిచ్చారు. ప్రస్తుతం సికింద్రాబాద్ బీజేపీ అభ్యర్థిగా ఉన్న కిషన్‌రెడ్డి గతంలో హైదరాబాద్‌కు వరదలు వస్తే రూపాయి సాయం చేశాడా..? ఐదేండ్లు కేంద్ర మంత్రిగా ఉండి అంబర్‌పేటకు రూ.5 పనిచేశాడా ? ఒక్క విద్యా సంస్థ, కాలేజ్, ఒక్క గుడి కట్టాడా ? అని కేటీఆర్ ప్రశ్నించారు. ''మళ్లీ బీజేపీకి ఓటు వేస్తే పెట్రోల్, డీజిల్ లీటర్ ధర రూ.400 అయితది. అసలు బీజేపీ వాళ్లకు ఎందుకు ఓటెయ్యాలి.'' నగరంలో మెట్రో విస్తరించేందుకు ఒక్క పైసా ఇయ్యలేదన్నారు. జూన్ 2తో ప్రత్యేక తెలంగాణ రాష్ట్రానికి 10 ఏళ్లు నిండుతాయి. హైదరాబాద్ పై పట్టుకోసం ఢిల్లీని చేసినట్లు భాగ్యనగరాన్ని కేంద్రపాలిత ప్రాంతం చేయాలని చూస్తున్నరని తెలిపారు. ''సికింద్రాబాద్‌లో బీజేపోళ్లే కిషన్ రెడ్డి హఠావో సికింద్రాబాద్ బచావో అంటున్నరు.'' 2014, 2018లో బీజేపీని ఓడించింది బీఆర్ఎస్సేనన్నారు.

### ఫ్యామిలీతో వార్తలు చూసే పరిస్థితి లేదు..

ఎన్నికల ప్రచారంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడుతుంటే కుటుంబ సభ్యులతో కలిసి టీవీలు చూసే పరిస్థితి తెలంగాణలో లేకుండా పోయిందన్నారు. నేను లంకెలు బిందెలు ఉన్నాయనుకొని వచ్చానని, అసలు వాటి కోసం వచ్చేది దొంగలు కదా? ఒక ముఖ్యమంత్రి అయి ఉండి అలా మాట్లాడటం ఎంతవరకు సమంజసమని కేటీఆర్ అన్నారు. ఎన్నికల్లో గెలుపు కోసం రేవంత్‌రెడ్డి పచ్చి అబద్దాలు మాట్లాడుతున్నారని, 6 గ్యారెంట్లో 5 అమలు చేశామని అంటున్నారు.. అసలు అమలయ్యాయా? అని నిలదీశారు. లక్ష లగ్గాలు అయినవి, వాటికి డబ్బులు ఇవ్వకపోతే రేవంత్ రెడ్డి నీ లగ్గం ప్రజలు చేస్తారని కేటీఆర్ హెచ్చరించారు. కాంగ్రెస్ పార్టీ అరచేతిలో వైకుంఠం చూపిస్తే జిల్లాలు, గ్రామీణ ప్రాంతా ల్లో ప్రజలు నమ్మి మోసపోయారన్నారు. రూ.2500 మహిళలకు ఇచ్చినమని రాహుల్‌గాంధీ చెబుతుండు.. మరి వచ్చినయా? వృద్ధులకు రూ.4వేలు అన్నాడు.. వచ్చినయా? అని ప్రశ్నించారు. ''ఈ పార్లమెంటు ఎన్నికల్లో సికింద్రాబాద్, మల్కాజిగిరి స్థానాలను మనమే గెలుస్తున్నాం. పజ్జన్నకు అంబర్‌పేటలో 50వేల మెజార్టీ రావాలి.'' 24 ఏళ్లుగా కేసీఆర్‌తో ఉంటూ ప్రజలకు అందుబాటులో ఉండే పజ్జన్నను గెలిచిపించాలని కేటీఆర్ కోరారు.


అంబర్‌పేట తిలక్‌నగర్‌లో బీఆర్ఎస్ రోడ్ షోకు హాజరైన జనం


అంబర్‌పేట నియోజకవర్గంలోని తిలక్‌నగర్‌లో నిర్వహించిన రోడ్ షోలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, చిత్రంలో సికింద్రాబాద్ ఎంపీ అభ్యర్థి పద్మారావు గౌడ్, ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్, కార్పొరేటర్లు తదితరులు



రోడ్ షోలో ప్రజలకు అభివాదం చేస్తున్న బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, ఎమ్మెల్యే పి.సబితా ఇంద్రారెడ్డి, చేవెళ్ల ఎంపీ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్ ముదిరాజ్

# బడంగ్‌పేట.. జన సంద్రం

### ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి ఆధ్వర్యంలో కేటీఆర్ రోడ్ షో గ్రాండ్ సక్సెస్

బడంగ్‌పేట, మే 7: చేవెళ్ల పార్లమెంట్ పరిధిలో నిర్వహించిన బీఆర్ఎస్ రోడ్ షోలకు ప్రజలు అంచనాకు మించి తరలివచ్చారని, దీంతో కాసాని జ్ఞానేశ్వర్ గెలుపు ఖాయమైందని మహేశ్వరం నియోజకవర్గ ఎమ్మెల్యే పి.సబితా ఇంద్రారెడ్డి అన్నారు. చేవెళ్ల పార్లమెంట్ పరిధిలోని రాజేంద్రనగర్, శేరిలింగంపల్లి, మహేశ్వరం నియోజకవర్గం పరిధిలో నిర్వహించిన కేటీఆర్ రోడ్ షోలను గ్రాండ్ సక్సెస్ చేసిన బీఆర్ఎస్ శ్రేణులకు, ప్రజలకు ఆమె కృతజ్ఞతలు తెలిపారు. బడంగ్‌పేట గాంధీనగర్ చౌరస్తాలో నిర్వహించిన రోడ్ షోలకు జనం రావడంతో ఆ ప్రాంతం జన సంద్రంగా మారిందన్నారు. కళాకారుల పాటలకు.. సభకు వచ్చిన ప్రజలు నృత్యం చేశారన్నారు. మహిళలు పెద్ద సంఖ్య లో సభకు తరలిరావడం చూస్తుంటే.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ విధానాలపై ప్రజలు విసిగిపోయారన్నారు. బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ రాకతో సభలో ఫుల్ జోష్ వచ్చిందని, పార్టీ శ్రేణులు, ప్రజలు గులాబీ జెండాలు ఎత్తి కేటీఆర్‌కు ఘన స్వాగతం పలికారని వివరించారు. కేటీఆర్ మాట్లాడుతున్నంత సేపు జనం ఆసక్తిగా ఆయన మాటలు విన్నారని చెప్పారు. కాసానిని గెలిపించుకొని బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌కు గిఫ్టుగా ఇద్దామన్నారు. కాంగ్రెస్, బీజేపీ నాయకులు ఏ ముఖం పెట్టుకొని ఓట్లు అడుగుతున్నారో ప్రజలు నిలదీయాలన్నారు.ఈ కార్యక్రమంలో మేయర్ దుర్గా దీప్‌లాల్ చౌహన్, డిప్యూటీ మేయర్ తీగల విక్రంరెడ్డి, కార్పొరేటర్లు అర్జున్, శోభా ఆనందర్ రెడ్డి, స్వప్న వెంకట్ రెడ్డి, పవన్ కుమార్ యాదవ్, దీపికాశేఖర్ రెడ్డి, స్వప్న జంగారెడ్డి, మమత కృష్ణారెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు రాంరెడ్డి, కామేశ్ రెడ్డి, అరవింద్ శర్మ, శ్రీనివాస్ రాజ్, రాజు నాయక్, విజేందర్, అరవింద్ తదితరులు పాల్గొన్నారు.


గాంధీనగర్ చౌరస్తాలో బీఆర్ఎస్ పార్టీ రోడ్ షో కార్యక్రమానికి హాజరైన జనం